7

# పేరులేని కథ

హోటల్ ఆకాశ్‌ను చూడాలంటే- మెడ వెనక్కి వంచి, ముఖాన్ని భూమికి సమాంతరంగా వుంచి, హోటల్ గదుల ముందు చిన్న చిన్న బాల్కనీలపై నుంచి, అద్దాల కిటికీల మీద నుంచి, అద్దాల వెనుక ఖరీదైన కర్టెన్ల మీది నుంచి, అక్కడక్కడ కొందరు అశ్రద్ధగా కిటికీ పూచల మీద పడేసిన టర్కీ టవల్స్, విఐపి అండర్ వేర్స్ మీదుగా చూపును సాగదీసి చూడాల్సి ఉంటుంది.

మల్లయ్య కూడా అలాగే చూస్తున్నాడు. ఇపుడు వాడి పేరు మల్లేష్.

మల్లేష్‌కు ఎన్నేళ్ళో సరిగా చెప్పడం కష్టం. ఎక్కడివాడో, ఎవరి వాడో వాడికూ్కడా తెలియదు. ఎప్పుడో ఎవరో ఇచ్చిన చిరిగిన నిక్కరు, రంధ్రాలు పడ్డ బనియను వేసుకున్నాడు. బనియను వాడి శరీరంతో పోటీ పడుతున్నట్లు నల్లగా అయ్యింది. చలికి చర్మం పగిలిన చారలు, మోకాలి దెబ్బలు, కాలి మడమ దగ్గర పుళ్ళు.

వాడికి ఈ మధ్య కొన్ని కోర్కెలు మొదలు అయ్యాయి. హోటల్ ఆకాశ్‌పై దాకా వెళ్ళి, బాల్కనీలో కొచ్చి కిందికి చూడాలని. అక్కడినుంచి చూస్తేకింది వాహనాలు, మనుషులు చీమల్లా కనిపిస్తారట! ఎలా ఉంటుందో.... చూడాలని వుంది. హోటల్ గేట్లోంచి లోనికెళితే విశాలమైన ఆవరణ. అక్కడ పెద్ద కార్లు ఆగుతాయట! ఎర్రనీ పచ్చనీ లైట్లు వెలుగుతూ వేయింగ్ మిషన్ ఉంటుందట! దానిమీద నిలబడి 50 పై. వేస్తే, మన బరువెంతో ఠకీమని తెలిసి పోతుందట! ఇవన్నీ కిష్టయ్య చెప్పిన విశేషాలు. కిష్టయ్య

హోటల్ ఆకాశ్‌లో క్లీనరు బోయ్. మెత్తని చలువ రాళ్ళను మెరిసేట్లు చేసే వాళ్ళలో కిష్టయ్య ఒకడు. కిష్టయ్య చెప్పినవన్నీ చూద్దామనిపించింది. హోటల్లోకి వెళ్తుంటే ఓసారి గూర్ఖావాడు కసిరి పంపించాడు. ఆ విషయం కిష్టయ్యకు చెప్తే, గొప్పగా నవ్వి- "రేపు నేను తీస్క పోతాతీయ్" అని అన్నాడు. అందుకే గంట సేపటి నుంచి కిష్టయ్య కోసం ఎదురు చూస్తున్నాడు మల్లేష్. సన్నగా కట్టె పుల్లల్లా వున్న వాడి కాళ్ళల్లో వణుకు మొదలైంది. నిలబడ లేక కూలబడ్డాడు. ఆకలి మొదలైంది. భయం భయంగా వుంది. గాబరా గాబరాగా వుంది. ఆ పూట వాడి దగ్గర రెండు రూపాయలు వున్నాయి.

* * *

తనకు మెలకువ రాగానే ఆటో చప్పుడు విన్నాడు. తను రోజూ పడుకుని మసీదు పిట్ట గోడ పక్కనే చెత్త కుండీలో చప్పుడయ్యింది. వికృతంగా నవ్వు వినిపించింది. భళ్ళున కళ్ళు తెరిచి చూశాడు. నిలువెత్తు మనిషి చెత్తంతా, తోడి, నెత్తిలో పోసుకుంటూ నవ్వుతున్నాడు. అతని వంటి నిండా గుడ్డ పేలికలు వేలాడుతున్నాయి. కాళ్ళకు గుడ్డలు చుట్టుకున్నాడు. నెత్తి వెంట్రుకలకు కూడా గుడ్డ పేలికలు చుట్టుకున్నాడు. ఎడమ చేతిలో పాత గుడ్డల మూట వుంది. అతనికి ముక్కు లేదు. రంధ్రాలు భయంకరంగా కనిపిస్తున్నాయి. ధొడ్డు పెదాల పైనుండి చొళ్ళు కార్తోంది. అతను మెల్లగా కదిలాడు. నిదానంగా మరోవైపు వెళ్ళిపోయాడు. రోడ్డుమీద అప్పుడో సైకిలు, ఇప్పుడో సైకిలు పోతోంది. పూర్తిగా తెల్లవారింది. తను మేల్కొన్నాడు. కానీ కళ్ళు మూతలుపడుతున్నాయి. రాత్రంతా నిద్రలేదు. రాత్రి రష్ బాగా వుంది. రెండో ఆట సినిమా వదిలేసిన తరువాత కూడా తడకల హోటల్లో తనింకా చాయ్ లందిస్తూనే వున్నాడు.

రోజూ రాత్రి చాయ్ తాగడానికి లస్కరు మామ వచ్చేవాడు.

మామ లారీ నడుపుతాడు. ఎపుడైనా తనను లారీ ఎక్కించమని అడగాలి. అప్పుడెప్పుడో చాలా రోజుల క్రితం 'అమ్మా-నాయినా ఎవ్వరూలేరు' అని చెప్పినపుడు జాలిగా చూశాడు. నెత్తినిమిరి దగ్గరకు తీసుకున్నాడు. "భయపడకు వారీ, నిన్ను పెంచుతా. నా లారీ మీదుం దువు గని, ముందుగాల అత్తను దేవాలె. అటెన్క నిన్నుగొంటవోత" అన్నాడు. 'అత్తేడున్నదే' అనడిగితే మామ బొలా బొలా నవ్వాడు. 'ఇగో-గీడ-గీడ' అని నొసలు చూయించాడు. "గీడ ఏడ వున్నదో" అని చెయ్యిగాలిలో ఎగరేసి, బీడి ముట్టించుకుని వెళ్ళిపొయ్యాడు. అంతే చాలా రోజుల్నుండి రావడం లేదు.

కళ్ళు తెరిస్తే మండు తున్నాయి. లేచే ఇష్టం లేదు. కానీ లేవాలి. అందులో కిష్టయ్య రమ్మన్నాడు. పెద్ద హోటల్లోకి తీసుకు పోతానన్నాడు. బరువు చూసుకోవాలి. దిగ్గున లేచినిలబడ్డాడు. అటు ఇటూ చూశాడు. చెత్తకుండీ వైపు ఆలోచించ కుండానే వెళ్ళి మూత్రం పొయ్యడం మొదలు పెట్టాడు. అంతకు ముందు తోడిపోసిన చెత్త, గడ్డీ, గుడ్డపీలికలు, కాగితాలు పరిశీలనగా చూస్తూనిలబడ్డాడు. అందులో ఒక పెద్ద ఖాళీ సీసా కనిపించింది. దానిని కడిగి అమ్మితే డబ్బులు వస్తాయి. దాంతో కిష్టయ్య చెప్పినట్లు బరువు చూసుకోవచ్చు. మెదడ్లో ఆలోచన మెరిసింది. వంట్లో రక్తంపులకరించింది, మొలతాడు కింద లాగు సరిగా చెక్కుకుని సీసా తీసుకున్నాడు. ఎగిరి గంతేశాడు. నాలుకతో లొట్టలు వేశాడు. తనను ఎవరైనా చూస్తున్నారేమోనని అటూ ఇటూ చూశాడు. ఎవరూ పట్టించుకోవడం లేదు. సీసా చంకలో పెట్టుకుని మజీదు దాటుతూ వుండగా చిన్న బొందలో కుక్కలు కాట్లాడుకుంటున్నాయి. గుడ్డ పేలికల మూటను లాక్కు పోతు న్నాయి. ఒకదాన్నొకటి తరిమివేస్తున్నాయి. ఒకదాన్నొకటి కరుచు కుంటున్నాయి. అరుస్తున్నాయి. ఆ గుడ్డలో మాంసంముద్ద ఉన్నట్లుంది. తను నిలబడి పరీక్షగా చూశాడు. ఆ మాంసం ముద్దకు చిన్న ముఖం

కళ్ళు ముక్కూ కనిపించాయి. చిన్న చిన్న చేతులు, పాదాలు కూడా గుడ్డలోంచి బయట పడ్డాయి. చిన్నపాపేమో అని అనుమానం వేసింది. అటువైపు ఎవరూ రావడం లేదు. కుక్కల నోళ్ళలో అలా చూడా లంటేభయ మేసింది. రాయితీసి కుక్కల్ని కొట్టాడు. దెబ్బతాకిన కుక్క ఎదురు తిరిగింది. పరుగులంకించుకున్నాడు. మళ్లీ వెనక్కి చూడలేదు. మరోగంటలో సీసా అమ్మడై పోయింది.

ఆరోజు టీవీ మహాభారతంలో 'కర్ణ జననం' ఘట్టం వాడు చూశ్నేదు.

* * *

గంట క్రితం ఉన్న ఉత్సాహం తగ్గినట్టుగా నీరసంగా వుంది. కళ్ళలో కడుపులో సెగ మొదలైంది. తల భారంగా తోచింది. హోటల్ ఎత్తును నాలుగు సార్లు చూశాడు. కళ్ళు తిరగడం మొదలు పెట్టాయి. ఆపని మానుకున్నాడు. ఇప్పుడిక కిష్టయ్య రాడేమో తనే ప్రయత్నం చేసి లోనికి చేరితే? భయం వేసింది. అయినా ప్రయత్నం చేసి చూద్దా మనిపించింది. అదను చూశాడు. గూర్కా సిగరెట్ తాగుతూ ఎవరి తోనో మాట్లాడుతున్నాడు. తనవైపు చూడడం లేదు. ఒక్కపరుగు తీస్తే....ఒక నిముషం ధైర్యం, అంతే తను లోన వుంటాడు. ఉరకాలి. ఒక్క ఉరుకు. అంతే-

ఆశ్చర్యం!!!

కొత్తలోకం చూసినంత ఆశ్చర్యం. తను లోనికి చేరుకున్నా డన్నమాట! నిదానంగా ఒక్క క్షణం ఆలోచించాడు. వెనక్కి చూశాడు. మనసులో ఏదో వర్షం వెలిసినట్లయింది. గూర్కా నిదా నంగా అలాగే మాట్లాడుతున్నాడు. ఏదో పెద్ద కారు వెళ్లి పోతుంటే- ఠకీమని మాటలాపి సలాం చేశాడు. ఫలితంగా చేతిలో నోటు!

మల్లేష్ చెట్టు పక్కకు తప్పుకున్నాడు. అంత ఖరీదైన కారు వాడి కళ్ళలో మెరవలేదు. గూర్కా చేతిలో పడ్డనోటు చూసి కళ్ల

మెరిసాయి. గూర్ఖా అతను కిష్టయ్యకంటే గొప్పవాడన్నమాట. ఒక్కసారి నమస్తే చెబితే రూపాయి! రోజుకు ఎన్ని నమస్తేలకు ఎన్ని రూపాయలో.... చుట్టూ నాలుగువైపులా చూశాడు. అశోకా చెట్లు చిన్న మొక్కలు, రంగు రంగుల పూలు, మెత్తని పచ్చిగడ్డి.

కారు ఆగగానే ఇద్దరు తెల్లనిమనుషులు దిగారు. ఆడా, మగ ఆ తరువాత చిన్నపాపను దించారు. కారు తలుపులుమూసి హోటల్లోకి దారి తీశారు. పాప, వాళ్ళమ్మ, నాన్నచేతులు పట్టుకుని, ఇద్దరి మధ్య తప్పటడుగులు వేస్తోంది. అది వాళ్ళకు వేడుకగా వుంది. మల్లేష్‌దృష్టి వాళ్ళ మీద పడింది. 'చాన గొప్పోల్లున్నట్లున్నది' అనుకున్నాడు. తన కూ్కడా 'గసోంటోల్లుంటే ఎట్లుండేదో' అనుకున్నాడు....

*　　　*　　　*

తనకు కాక వుండేవాడు. కాక ఎవరో అతని గతచరిత్ర ఏమిటో తెలియదు. తనకు తిండి పెట్టేవాడు. చిప్పచేతికిచ్చి బిచ్చమడుక్కోవడం నేర్పించాడు. తనకు కొద్ది కొద్దిగా మనుషులు తెలుస్తున్న సమయంలో కాకతోపాటు వుండేందుకు మరో ఇద్దరు వచ్చారు. "పెద్దయ్య పెద్దమ్మరా నీకు"- అని కాక తనకు చెప్పాడు. తను ఎక్కడో ఫుట్‌పాత్‌మీద దొరికితే తెచ్చి పెంచుతున్నానని వాళ్ళకు చెప్పాడు.... అప్పుడందరూ కలిసి కాజీపేటలో వుండేవారు. రైల్వే స్టేషన్ బయట చెట్టుకింద వండుకుతినేవారు. రైలు రాగానే వెళ్లి బిచ్చమడుక్కునేవారు. పెద్దమ్మకు చిన్నబిడ్డ ఉండేది. కాని పెద్దయ్యను ముట్టుకోనిచ్చేదికాదు. అస్తమానం ఏడ్చి గీ పెడుతూ వుండడం వల్ల ఆ పిల్లంటేనే అసహ్యం వేసి, తను తప్పించుకు తిరిగేవాడు. పెద్దమ్మకు కోపం వచ్చేది. ఏం చెప్పిందో ఏమో ఓరోజు కాక తనను వళ్ళు వాచిపొయ్యేట్టు కొట్టాడు. జ్వరం వచ్చింది. అప్పటి నుండి

కాకను చూడాలంటేనే భయం వేసేది. ఎందుకోగాని ప్రతి చిన్నదానికీ కాక తనను చితక బాదడం నేర్చుకున్నాడు. కాకతో దెబ్బలు తినే కంటే ఎటైనా పారిపోవాలనిపించేది. అందులో రైలెక్కి పారిపోతే ఎలా వుంటుందో చూడాలనిపించేది.

ఈత కమ్మలతో చాపలు అల్లుతూ, పెద్దమ్మ పాటలు రాగాలు తీస్తూ పాడుతూ వుండేది. నల్లగా, దొడ్డుగా వుండేది. పెద్దనాయనను ఎప్పుడూ తిడుతుండేది. "నువ్వేవనివిరా నాకు? కట్టుకున్నదానిమీద పెత్తనం చెలాయించినట్టు చెలాయిస్తవు. పోతె పో. ఏనన్న సావు నాకేంది?"-అనేది. కాక కిసుక్కున నవ్వేవాడు. కొన్ని రోజులుఆమె బిడ్డతో పాటు తననూఒళ్ళో పడుకోబెట్టుకునేది. ఓరోజు రాత్రి మాత్రం గాడిదోలె అయినవు. శిన్న పిలగానివా - పో-'' అని కసిరింది. తనకు ఏడ్పొచ్చింది. రైలు జ్ఞాపకం వచ్చింది. ఏడ్చి ఏడ్చి పడుకున్నాక మధ్యలో ఎప్పుడో మేల్కొచ్చింది. రోజూ పడుకునే అరుగే, చలి పీల్చుకుని చల్లగా అయ్యింది. అక్కడ ఎప్పుడూ తిరుగుతుండే గజ్జికుక్క కక్కుతోంది. కళ్ళు తెరుద్దామంటే భయం, చీకటి, చలి రోడ్డు మీది లారీ గుండెల మీది నుంచి పోతున్నట్లు అనిపించింది. ఎవరో రోడ్డు మీద కట్టెతో కొట్టుకుంటూ పోతున్నారు. కాకను పిలుద్దామనిపించిది. గొంతు నిండా చలి నిండి పెగల్లేదు. మెల్లిగా తను కళ్ళు తెరిచాడు. చీకటి, చీకటే - చీకట్లో చెట్లు దయ్యాల్లా కనిపిస్తున్నాయి. వూగుతున్నాయి. గుండెలో దప్పు మోగుతోంది. తన వెనక బరువైన శ్వాస వినిపిస్తోంది. మూలుగులు..... ఆ గొంతు పెద్దమ్మది.

ఎందుకు బాధపడుతోంది? ఏమో - మాటలులేని గుసగుసలు. గూడ్స్ ట్రెయిన్ కాబోలు దూసుకొస్తున్న చప్పుడవుతోంది. తను తల వెనక్కి తిప్పి చూశాడు. అతనెవరూ? కాకా? కాకేనా?....అలాగే వున్నాడు. కాకలాంటతను. కాకే - కాక! అట్లా ఎందుకు పాకు

తున్నాడు? రైలు శబ్దం మీ్మద పడుతోంది. ఆమె మెల్లిగా ఊఁ - ఆఁ- అంటోంది. అతడు పాములా బుసకొడుతున్నాడు. పాము కప్పను పట్టుకున్నట్టు పట్టుకున్నాడు. ఆమె స్వరం లోలోతుకు పీక్కుపోతోంది. వేడి శ్వాసలు ఢీకొంటున్నాయి. కాక పెద్దమ్మను ముద్ద చేస్తున్నాడు. ఆమె చేతులు విరిచేస్తున్నాడు. గొంతు కొరుకు తున్నాడు. రక్తం పీల్చి చంపుతున్నాడు.....

పాము బుస కొడుతోంది

పాము వంటినిండా పాకుతోంది

పాము గొంతు చుట్టూ బిగుసుకుంటోంది

తనకు వూపిరి ఆడడం లేదు.

"వామ్మో!!" - తనకు తెలియకుండానే కేక తన గొంతు నుండి దూకింది! ఆ క్షణంలోనే రైలు పెద్ద శబ్దం చేస్తూ చెవుల్లోంచి దూసుకు పోయినట్లు స్టేషను దాటి పోయింది. కొన్ని క్షణాలు తన కేమీ తెలియలేదు. తను అరుగు మీది నుండి కింద పడ్డాడు. మోకాళ్లూ, మోచేతులు గీచుకుపోయినయి. తల అదిరింది. కదిలేట్లుగా లేడు తను.

"ఏంర్ర మల్లి? రైల్ సప్పుడుకు జడుస్తావ్? లే - అరుగు మీద పండుకో" కాకే. కాకమాటలే అవి. లేపి, పడుకో బెట్టాడు. చలి వెన్ను పూసను తొలిచేస్తోంది. కాక తనను కొట్టి కొట్టి చివరకు ఓ రోజు ఇలాగే చంపుతాడేమో. మళ్లీ నిద్ర పట్టడం లేదు. పెద్దయ్య ఎక్కడ పొయ్యాడో రావడం లేదు. కాకే చంపాడో ఏమో. అను కుంటేనే గుండె చచ్చిపోతోంది. కాక చెయ్యితీసి అటు తిరిగి పడు కున్నాడు. అప్పుడు గాని కొంచెం ఊపిరి సాగినట్టులేదు. అలా ఎన్ని గంటలు ఎన్ని గంటలు గడిచాయో తెలియదు. తెల్లవారితే బావుం ట్టని అనుకోని క్షణం లేదు....

* * *

హోటల్ ఆకాశ్‌లో వరండా మెట్లెక్కుతున్న చిన్నపాప కాలుజారి పడబోయింది. చూస్తూ నిలబడ్డ మల్లేష్ తనలో "అయ్యో" అని అనుకునేంతలోనే చెరొక వైపు నుంచి వాళ్ళ మమ్మీ, డాడీ పాపను అమాంతం పైకి లేపారు. పాప బోసి నవ్వులో వాళ్ళిద్దరి నవ్వులు కలిసాయి.

"ఆరోజు తెల్లారగట్లనే పాసింజర్ రైలెక్కి ఊకెనన్న పట్నం పారిపొయ్యొస్తిని"-అని విచారించాడు మల్లేష్. లేకపోతే కనీసం కాక వుండేవాడు తనకు. రైల్లో సీట్లకింద నక్కి పట్నం చేరుకున్న విషయం, టికెట్ కలెక్టర్ పట్టుకుని, దవడలు పగలగొట్టిన విషయం మౌలాలి దాటాక మధ్యలో రైలు సిగ్నల్ కోసం ఆగినప్పుడు దించేసిన విషయం రోజూ జ్ఞాపకాని కొస్తుంది. చూస్తుండగానే పారి పొయ్యొచ్చి మూడేళ్ళు దాటుతున్నాయి.

ఆ రోజు రాత్రి ఎందుకంత భయమేసిందో ఏమో-మరో ఎర్రని కార్లో వేరే దేశస్తులు కాబోలు వచ్చారు. కారు వెనుక కారు వస్తూనే వుంది. చాలా సేపటి తర్వాత తన వయసు కుర్రవాడొకడు కనిపిస్తే కిష్టయ్య గురించి అడిగాడు. అతను ఎంగిలి ప్లేట్లు ప్లాస్టిక్ బుట్టలో పట్టుకుని పోతున్నాడు. అతను కిష్టయ్యను పంపిస్తానన్నాడు. మల్లేష్ పెద్ద ద్వారం దాకా వెళ్లి లోనికి తొంగి చూశాడు.

లోన ఎత్తయిన కుర్చీలు వున్నాయి. 'సూసేటందుకే గంత మెత్తగున్నయి. ఇక కూసుంటే ఎంత మెత్తగుంటయో' అనుకున్నాడు.

ఇంతలో కిష్టయ్య వచ్చాడు. సంతోషంగా మల్లేష్ భుజం తట్టాడు. చిరు నవ్వులు బహూకరించాడు. వేయింగ్ మిషన్ దగ్గరకు తీసుకు వెళ్ళాడు. "తొందరగ జూస్కోని ఎల్లిపోవాలె. సేటు చూస్తే కోపం జేస్తడు" అని గాబరా పెట్టాడు. అతను చెప్పినట్లు మల్లేష్

ఎక్కి నిలబడ్డాడు. లైట్లు కుడికీ ఎడమకు, కుడికీ ఎడమకు మారి మారి ఆరిపోతూ వెలుగుతున్నాయి. ఎదురుగా ఏదో చక్రం అటూ ఇటూ తిరుగుతోంది. నిశ్శబ్దం గంభీరంగా వుంది. వేయింగ్ మిషన్ ఫుట్‌బోర్డు ఎక్కాడు. కాని నిలబడ లేక పోతున్నాడు. తడబడు తున్నాడు. ఖరీదైన మనుషులు హడావుడిగా తిరుగుతున్నారు. కిష్టయ్య ఫకాలుమని నవ్వాడు. నవ్వి-

"అబ్బే ఏం బయపడ్తవ్ రా? అండ్ల ఆతాన ఎయ్' అన్నాడు. కిష్టయ్య గదమాయింపు బాగనిపించలేదు. లేనిపోనిది ఎందుకొచ్చింది. కిందికి దిగే ప్రయత్నం చేశాడు. కాని ఇన్ని రోజులుగా అనుకుని మానెయ్యడమెందుకని సరిగ్గా నిలబడ్డాడు. ఠకాలున 50 పైసలు వేశాడు. దిగిపోతాడో, నిలబడతాడో సరిగా అర్థం చేసుకోలేని వేయింగ్ మిషన్ ధడగ్ ధడగ్ శబ్దం చేసి, చిన్న అట్టముక్క పడేసింది.

మీరే దేశానికి బరువైతే మీకేం బరువుర్రా - అన్నట్టు కళ్ళు చిట్లించిన ఓ ఉంగరాల చేయతను "ఏయ్ ఛట్ ఛట్" అని జంతువును అదిలించినట్లు అదిలించి, తన బరువు చూసుకోవడం మొదలు పెట్టాడు. మెళ్లో బంగారు గొలుసుతో తెల్లని బట్టలతో వున్న ఆ నల్లటి లావుపాటి మనిషికి మల్లేష్ గురించేమీ తెలియదు. ఇంకా నయం. తెలిస్తే 'కన్నవాళ్ళకే బరువైన వాడివి. నీకూ్కడా బరువు కావాల్సి వచ్చిందా?'- అని పురుగును చూసినట్లు అసహ్యంగా చూసేవాడు.

మిషన్ లోంచి వచ్చిన అట్టముక్క ఒక వైపు డబ్బు బాగా సంపాదిస్తావు. బంధువులు చుట్టూ మూగుతారు. ఇతర్లు అసూయ పడేలా బతుకుతావు'-అన్న అర్థంలేని అదృష్టం మల్లేష్‌కు అర్థమయ్యే ప్రమాదం లేకుండా తెలుగులోను, ఇంగ్లీష్‌లోను ప్రింట్ చేసి వుంది.

నాకు తెలిసిన గొప్ప విషయం నీకు చూపిస్తున్నాను. అన్న

ట్లుగా వింతగా గర్వంగా చూస్తున్న కిష్టయ్య ముందుగానే అట్టముక్క లకీమని అందుకని, అటూ ఇటూ మార్చి మార్చి చూసి, మల్లేష్ ముఖంలోకి చిలిపిగా నవ్వి 'ఏహే నీయవ్వ! లెక్క పత్రం లేకుండ నెంబరు మీద నెంబ రెక్కింది' అన్నాడు. బరువు చూసుకుంటున్న ఉంగరాల చెయ్యతను ఉలిక్కిపడి భుజాలు తడుముకున్నాడు.

మల్లేష్‌కు అదొక తిట్టులాగా అనిపించింది. సరైన నెంబరు రాకపోవడానికి తన తెలివితక్కువ తనమే కారణమేమోనన్నట్లు ముఖం మాడ్చుకున్నాడు. ఈలోగా సర్వరు ఒకతను కిష్టయ్యను తిడుతూ కేకలేశాడు. కిష్టయ్య భయపడి, వస్తున్నట్లు నటించాడు. సర్వరు వెళ్లిపోగానే మల్లేష్ వంక తిరిగి హాయిగా నవ్వేశాడు. చేయి పట్టుకుని వరండా చివరిదాకా తీసుకువెళ్లి, మలుపు తిరగగానే వచ్చిన మెట్లు చూయించాడు. పైకి వెళ్ళడానికి దారి అదేనని చెప్పాడు.

మల్లేష్ ఒకొక్క మెట్టు నిదానంగా ఎక్కాడు. మొదటి అంతస్తు వచ్చింది. బాల్కనీలోకి వెళ్లి చూశాడు. కిందగూర్ఖా కూర్చుని వున్నాడు. సరిగ్గా గేటుపైన వున్నాడన్నమాట. కొత్త విషయం తెలుసుకున్న సంతోషం కలిగింది. మనుషుల నుదుర్లు, తలలుమాత్రమే కనిపిస్తున్నాయి. వడివడిగా మరో అంతస్తు ఎక్కాడు. సంతోషం పెరిగింది. మల్లేష్‌కు చెట్లు ఎక్కిన అనుభవం తప్పిస్తే, ఇలాంటి పెద్ద భవనం ఎక్కిందిలేదు. చెట్టెక్కి చిటారు కొమ్మకు చేరుకున్నట్లు పరుగెత్తుతూ మూడు నాలుగు అంతస్తులెక్కాడు. ఎక్కేవాళ్ళను దిగే వాళ్ళను గమనించకుండా ఆ ఆనందంలో పై పైకి పోతున్నాడు ప్రతి అంతస్తుకు తను ఎంతో ఎత్తు ఎదుగుతున్నంత ఆత్మవిశ్వాసం పెరుగుతోంది. తనెక్కడో బిచ్చం అడుక్కుంటూ ఎవరో పెంచితే పెరుగుతూ బతికే తను, ఇప్పుడు ఒక్కడూ తనకు తాను బతక గలుగుతున్నాడు. రేపొద్దున కిష్టయ్యలాగా, గూర్ఖాలాగా ఎక్కువ డబ్బు సంపాదిస్తాడు. కాళ్ళు మెట్లమీద పరుగు తీస్తున్నాయి. ఐదు, ఆరు,

కాళ్ళు కొంచెం నెప్పిగా అనిపించాయి. పరుగు తగ్గింది. ఆగకూడదు. ఎన్ని కష్టాలొచ్చినా ఎదుర్కోవాలి. బాగా బతకాలి. తడికల హోటల్ వదిలేయాలి. మంచి హోటల్లో పనిచేయాలి. ఏడు ఎనిమిది, చెమటలు పట్టేశాయ్. శ్వాస తీవ్రంగా జోరుగా సాగుతోంది. కాళ్ళుబాగా గుంజుతున్నాయి. కణతలు బాగా నొప్పెడుతున్నాయి.

ఆకలి కడుపు ఓర్చు కోలేక, తిప్పడం మొదలు పెట్టింది. కళ్ళు మసక మసకగా కనిపిస్తున్నాయి. రోడ్డుమీద కార్లు పురుగుల్లా పరుగెడుతున్నాయి. పూర్తి అంచు చివరిదాకా వెళ్లి కింద గేటు దగ్గర నిలబడ్డ గూర్ఖాను ఒకసారి చూద్దామనుకున్నాడు. అందు కోసం మరో అడుగు, ముందుకు వేశాడు.

అంతే అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా పడేసి వున్న ఎలక్ట్రిక్ వైర్లు 'యమపాశాల్లా' కాళ్ళకు చుట్టుకున్నయి. నరాలన్నీలాగినయి. కళ్ళు శూన్యంలోకి గుంజుకు పోయినయి. రక్తం గడ్డ గట్టి, కండరాలు వడి తిరిగినయ్ వేలఖడ్గాలుముక్కలు చేసినై. లక్ష దేగలురక్తం పీల్చినై. శరీరం కొల్లగొట్టబడి జరిగిన ప్రాణం దోపిడీ అది! మల్లేష్ శరీరాన్ని శవంగా మార్చింది. ముందు వెనుకలు చూసుకునే జ్ఞానం మల్లేష్‌కు ఎవరూ నేర్పలేదు. ఎత్తికుదేసినట్లు మల్లేష్ శవం, పిట్టగోడ లేని పై అంతస్తునుండి కిందికి రాలింది.

మాంసం ముద్ద పైనుండి కిందకు దొర్లింది. గేటు ముందు చావు మరకలు. గూర్ఖా తిట్టి పంపడం లేదు. తన గుండె అక్కడ పడి చిట్లినట్టు లేవదీయబోయాడు. పాపం పత్రికలు!! 'ఒక కుర్రవాడి ఆత్మహత్య' అని రాసుకుంటాయి. అవగాహన వున్న కొంత మంది మాత్రం అది హత్యగా చదువుకుంటారు.

మనిషిని తిని భయంకరంగా నాలిక చాపుకుని కూర్చున్న క్రూర మృగంలా వుంది హోటల్ ఆకాశ్! బాధ్యతలేని సమాజం కని పారేసిన పసిగుడ్డులా వుంది మల్లేష్ శవం. సలాం హైదరాబాద్!! ○

ఆదివారం ఆంధ్రజ్యోతి
17 జూన్ 1990